క్లుప్తంగా

అంబాభవానీ ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భవానీ దీక్షాపరులు

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలోని అంబా భవానీ ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదివారం భవానీదీక్షాపరులు చండీ హోమం నిర్వహించారు. సుబ్రహ్మణ్యం భారతి స్వామి, ఆలయ ప్రధాన పూజారి చిన్నప్ప స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూర్ణాహుతితో హోమ కార్యక్రమం చేపట్టినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో సమాజ్ బంధువులు, భవానీదీక్షా స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గురుస్వామిని భవానీదీక్షాపరులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి

కౌతాళం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవమి రోజు ఆదివారం కౌతాళంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహామంగళహారతి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణ మహోత్సవంలో అప్పణ్ణచారి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి గ్రామ పురవీధుల గుండా స్వామి పల్లకీ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆదోనిరూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన నబీసాబ్ (45) శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు .. సంతెకూడ్లూరు నుంచి కూలీలు వరిగడ్డి లోడుతో ట్రాక్టర్‌లో ఎమ్మిగనూరుకు బయలుదేరి వెళ్లారు. అక్కడ వరిగడ్డి ట్రాక్టర్ అన్‌లోడు తీసి తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని మదిరె క్రాస్ వద్ద డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక కూర్చొన్న నబీసాబ్ కింద పడిపోయాడు. ప్రమాదంలో నబీసాబ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆటో కార్మిక యూనియన్ ఏర్పాటు

కౌతాళం: మండలంలోని ఉరుకుందలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివిన అనేకమంది ఉద్యోగ అవకాశాలు లేక ఆటో కార్మికులుగా మారి జీవనం సాగిస్తున్నారని వీరిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. జీఓ నెం 21తో ఈ చలానా ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఇలా అనేక రకాలుగా ఆటో కార్మికులపై భారాలు వేస్తున్నారని వాపోయారు. ఆటో కార్మికుల సంక్షేమానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా నరసింహులు, ఉపాధ్యక్షుడిగా పక్కీరయ్య, ప్రధాన కార్యదర్శిగా వీరారెడ్డి, జాయింట్ కార్యదర్శిగా తాయప్ప, సుందర్‌రాజ్ మరో 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

యువకుడి ఆత్మహత్య

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రేమడూరు గ్రామానికి చెందిన బోయ ఆర్ రవికుమార్ (18) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు రవికుమార్ మూడేళ్లగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. శనివారం రాత్రి భోజనం చేసి కొత్తగా కొనుగోలు చేసిన ఇంట్లో ఒంటరిగా పడుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటి పైకప్పుకు ఉండే ఇనుప కొక్కికి తాడుతో ఉరి వేసుకున్నాడు. మృతిడి తండ్రి లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వార్థ రాజకీయాలకు బలికావొద్దు



ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని సత్కరిస్తున్న అలసందగుత్తి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ఆదోనిటౌన్: స్వార్థ రాజకీయాలకు బలికావొద్దని, కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. చిన్న గొడవలను పెద్దవిగా చేసుకొని పోలీసు కేసుల్లో చిక్కుకుని కుటుంబాలు, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో అలసందగుత్తి గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు ఆయన్ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. అలసందగుత్తి, చిన్నపెండేకల్ గ్రామాల్లో ఇటీవల జరిగిన గొడవలపై పార్టీ శ్రేణులతో ఆరాతీశారు. గొడవల వల్ల నాశనమే తప్పా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. తాను గొడవలను ప్రోత్సహించనని, నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు దరిచేర్చడమే లక్ష్యమన్నారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకుల మాటలు నమ్మి తగాదాలు పెట్టుకోవద్దని సూచించారు. ఒక్కొక్కరిపై 11 కేసులకు పైగా ఉంటేనే పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇస్తామని టీడీపీ నాయకుడు నారా లోకేష్ చెప్పడం చూస్తుంటే ఆ పార్టీకి ప్రజా సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణ పట్టదని స్పష్టమవుతోందన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.80 కోట్లు

ఆదోని పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 18 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.80 కోట్లను విడుదల చేశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. పల్లెల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పులికనుమ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఐదారు గ్రామాలను కలుపుకొని ఒక స్కీంగా రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు.

ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకుగానూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని చేపట్టిందని, ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎలాంటి జబ్బుకైనా వైద్యం అందుతుందన్నారు. గత అర్ధరాత్రి ఇస్వీ గ్రామంలో గుండెపోటుకు గురైన బజారప్పను కుటుంబసభ్యులు ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్లగా రూ.45 వేలు విలువచేసే ఇంజెక్షన్ వేసి ప్రాణాలు కాపాడారని చెప్పారు. కాస్త కోలుకున్న బజారప్పను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారని ఇంతకన్నా మెరుగైన వైద్యం మరెక్కడా దొరకదన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో రావణ సంహారం కార్యక్రమాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, అలసందగుత్తి సర్పంచ్ రామకోటిరెడ్డి, ఆ గ్రామపెద్దలు ఉరుకుందప్ప, సోము, తమ్మన్నా తదితరులు ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన



హెల్త్ క్లినిక్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల చెంతకే పరిపాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి మండలంలోని చింతకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, దుద్ది గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యాలయ భవనాల్లో శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్నా గ్రామ స్వరాజ్యం తీసుకురావడమే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. ఏ ఒక్కరూ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కోసిగి మండలంలో 19 గ్రామ సచివాలయాలు, 16 రైతు భరోసా కేంద్రాలు, 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదివరకే కోసిగి-4, కోసిగి-5, దుద్ది, జంపాపురం, పెద్ద భూంపల్లి గ్రామాల్లో సచివాలయాలు, చింతకుంట, సజ్జలగుడ్డం, వందగల్లు, దుద్ది, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, దుద్ది, కోసిగిలో రైతు భరోసా కేంద్రాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతావి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించగా, అదనంగా మరో రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ డీఈ అశ్వద్ధామ, ఏఈ యుగంధర్ రెడ్డి, డాక్టర్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్, ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, నాయకులు నరసింహులు, శ్రీనివాస రెడ్డి, మాణిక్యరాజు, జగదీష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ రవికుమార్

ఆదోని సెంట్రల్: ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రవికుమార్ సూచించారు. పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. కాలనీలో 9,327 మందికి ఇంటి పట్టాలు మంజూరుకాగా అందులో మొదటి విడతగా 5,101 ఇళ్ల నిర్మాణాలను థర్డ్ పార్టీ వారు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 327 ఇళ్లు ఆర్‌సీ వేయగా 65 ఇళ్లు రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. 66 ఇళ్లు లెంటల్ లెవల్‌లో ఉన్నాయని తెలిపారు. 3,527 ఇళ్లు బేస్ మట్టం లెవల్‌లోను, 378 ప్లింత్ బీమ్ లెవల్‌లో ఉండగా 671 ఇళ్లు బీబీఎల్, పిల్లర్ కాంక్రీట్ లెవల్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పనులు చేపయాలని థర్డ్ పార్టీ వారికి సూచించారు. మెటీరియల్, లేబర్ వంటి సమస్యలు ఉంటే పరిష్కరించుకొని పనులు చేపట్టాలని ఆదేశించారు.

'విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి'

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకు ట్రాన్స్‌ఫార్మర్‌కు మినీ ఇండస్ట్రియల్ ఇటుక బట్టీల ఫ్యాక్టరీ వారికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం వల్ల లోడు ఎక్కువగా పడి మోటార్లు కాలిపోతున్నాయని సర్పంచ్ ఉచ్చప్ప, ఉప సర్పంచ్ తిక్కయ్య, గ్రామ నాయకులు వాపోయారు. దీనిపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ కాలువ నుంచి గ్రామంలో ఏర్పాటు చేసుకున్న ఎస్ఎస్ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసి గ్రామానికి సరఫరా చేస్తున్నామన్నారు. నీటిని పంపింగ్ చేసేందుకు పంచాయతీ తరపున ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామ పంచాయతీకి తెలియకుండా నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఇటుక బట్టీ మినీ ఫ్యాక్టరీకి కనెక్షన్ ఇచ్చారని, దీంతో నీటిని పంపింగ్ చేసే సమయంలో మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బట్టీ ఫ్యాక్టరీకి వేరుగా ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ డీఈ సుధాకర్‌కుమార్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.

8న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



సంఘీభావం తెలుపుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు


ఆదోని సెంట్రల్: కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ పిలుపునిచ్చారు. ఎన్‌జీఓ భవనంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్రంలోని బీజేపీ పెద్దలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. విభజన హామీలను ఇప్పటివరకు అమలు చేయడం లేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిశ్రమను ప్రైవేటీకరిస్తున్నారని, చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మాత్రం తల్లి ప్రేమను చూపిస్తూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో అభివృద్ధి జరగాలంటే విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ నెల 26న విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళా కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి అజిత్, ఎఐడీఎస్‌ఓ నాయకులు శివరాజ్, దస్తగిరి, కార్తిక్, దినేష్, గౌస్, నరేష్, సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న బన్నీ (కర్రల ఉత్సవం)కి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. బన్ని ఉత్సవంలో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు తాగునీరు, విద్యుత్ సదుపాయం, వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్, మీడియాపాయింట్, 108 అంబులెన్స్ వాహనాలు, అగ్ని మాపక వాహనాలు, వైద్య శిబిరాలు, భక్తులకు భోజన వసతి, ఉన్నతాధికారులకు విడిది తదితర ఏర్పాట్లు దాదాపు పూర్తిచేసినట్లు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు.



నెమలి పింఛాల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మ



బఠానీల అలంకరణలో పేట వీరభద్రేశ్వరస్వామి



మహిషాసుర మర్దిని రూపంలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



మహిషాసురమర్దిని అలంకరణలో..



మహిషాసురమర్దిని అలంకరణలో అంబాభవానీదేవి

జయ జయహే మహిషాసురమర్దిని



మహిషాసుర మర్దినిగా మాతా పరమేశ్వరి దేవి



మంత్రాలయంలో హోమక్రతువులో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



కౌతాళంలో అమ్మవారు



దుర్గామాత అలంకరణలో శాంభవీ దేవి

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలో వెలిసిన అమ్మవార్లు శరన్నవ నవరాత్రోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నెమలి పింఛాల అలంకరణలో ఆదోని భక్తుల ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ, మహిషాసురమర్దిని అలంకరణలో ఎంఎంకాలనీలోని మాతా పరమేశ్వరిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, నగరేశ్వర స్వామి ఆలయంలోని ఉత్సవమూర్తి, ఫారెస్ట్ లైన్ అంబాభవానీదేవి, బఠానీల అలంకారంలో పేట వీరభద్రేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కౌతాళం: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవాలయంలో, పంచాకృష్ణ జమ్మిచెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని, జమ్మిచెట్టును పూజించి మొక్కులు తీర్చుకున్నారు. ఈరన్న కట్ట వద్ద ఉన్న మహంకాళి దేవి ఆలయం వద్ద, శివారులో వెలసిన ఆదిబసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోసిగి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి దుర్గామాతగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే కోసిగిలో వెలసిన చౌడేశ్వరి దేవి, కాళికా దేవి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



నాగలదిన్నెలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

నందవరం: ప్రశాంతమైన పల్లెల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సీఐ నేతృత్వంతో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానుతుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో అల్లర్లకు పాల్పడితే ఎట్టివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, గొడవలు పడి జైలు జీవితం అనుభవించొద్దని సూచించారు. అందురూ అన్నదమ్ములుగా జీవించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, గుట్కా, పేకాట తదితర కార్యకలపాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎస్ఐ తిమ్మయ్య, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐ ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్‌పైకి దూసుకొచ్చిన అంబులెన్స్

కోడుమూరు రూరల్: స్థానిక కోట్ల సర్కిల్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపు తప్పి హోటల్‌పైకి దూసుకురావడంతో సురేష్‌తోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. ఈ ప్రమాదంలో హోటల్ పర్నీచర్ దెబ్బతినడంతో పాటు, నాలుగు ద్విచక్రవాహనాలు కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదమం అనంతరం అంబులెన్స్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

దేవనకొండ: నేపాల్ నుంచి వలస వచ్చి స్థానికంగా గుర్కా పనులు చేసుకుంటూ జీవిస్తున్న రానాబహదూర్ భార్య పార్వతి పది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేలు విలుచేసే వంద కేజీల బియ్యం, 10 కేజీల కందిబేడలు, ఐదు కేజీల చక్కెర, 14 లీటర్ల మంచినూనె, ఇతర సరుకులు అందజేశారు. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం . సహకార సొసైటీ సీఈఓ రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నయ్య శెట్టి, పల్లెదొడ్డి చంద్రన్న, తిరుమలేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

వెండి పడగ వితరణ



వెండి పడగను అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారికి ఆదివానం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఎం సిరిబాబు, ఆయన సతిమణి గుణవతి, విరాట్ క్రిష్ణయాదవ్ వెండి పడగ వితరణ చేశారు. 1కెజీ 19గ్రాముల వెండి పడిగెను అందించినట్లు ఈఓ రామక్రిష్ణ చెప్పారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం దాతలను సన్మానించారు.